


'కవ్వాల్'లో అడవికుక్కల బెడద
కవ్వాల్ అభయారణ్యంలో అడవి కుక్కల సంఖ్య పెరిగింది. వన్యప్రాణులను హడలెత్తించే బెబ్బులిని ఇవి భయపెడుతున్నాయి.
8లో▸



కరెంట్ కోతలతో పరేషాన్
ఓ వైపు భానుడు భగభగమంటున్నాడు. మరోవైపు జిల్లాలోని అన్ని మండలాల్లో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.
9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
43.5 /29.7
ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత పెరుగుతుంది. వడ గాలులు ఎక్కువగా వీస్తాయి. జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

న్యూస్‌రీల్

కళాశాలల్లో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ఇంటర్ కాలేజీల్లో నేటి నుంచి తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలని డీఐఈవో శ్రీధర్‌సుమన్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయం నుంచి ప్రభుత్వ, ప్రైవేట్, ప్రభుత్వ రంగ కళాశాల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 22 వరకు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం కళాశాలల్లో పండుగ వాతావరణంలో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఉత్సవాల నివేదికలను ఎప్పటికప్పుడు అధికారులకు పంపించాలని సూచించారు.

కవితలకు ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 11న నిర్వహించే సాహిత్య దినోత్సవం సందర్భంగా ఆసక్తి గల కవుల నుంచి ఉత్తమ కవితల ఎంపికకు స్వీయ కవితలను పంపించాలని డీఈవో అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కవులు ఈ నెల 6లోగా 20 వరుసలకు మించకుండా కవితలు రాసి, వ్యక్తిగత వివరాలతో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వం, రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ప్రగతిపై కవితలు రాయాలని, ఆ కవితలు ఏ పత్రికలో, ఇతర మాధ్యమాల్లో ప్రచురించలేదని ధ్రువీకరించాలని సూచించారు.

ఎంపిక జాబితా విడుదల

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి ఎంపిక జాబితాను విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో సాధించిన మెరిట్, రోస్టర్ ఆధారంగా ఒక్కో గ్రూపులో 40 మంది చొప్పున మొత్తం 160 మందిని ఎంపిక చేశామన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 3, 5, 6 తేదీల్లో టీసీ, బోనఫైడ్, పదో తరగతి మెమో, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రెండు ఫొటోల తోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. నిర్ణీత సమయంలోగా హాజరు కాని విద్యార్థుల అడ్మిషన్ రద్దువుతుందని పేర్కొన్నారు. ఎంపిక జాబితా కళాశాల నోటీస్ బోర్డుపై అందుబాటులో ఉందని తెలిపారు. అలాగే ఏడో తరగతిలో ఖాళీగా ఉన్న ఒక సీటు, పదో తరగతిలో రెండు సీట్లకు సంబంధించి ఎంపిక జాబితా సైతం విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు 5, 6 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు.

వీవోఏలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న లోకేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: ఐకేపీ వీవోఏలకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం వీవోఏలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీవోఏలకు కనీస వేతనంగా రూ.26వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమ్మె సందర్భంగా మంత్రి దయాకర్‌రావు ఇచ్చిన హామీని 15రోజుల్లో అమలు చేయాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రాజేందర్, శ్రీనివాస్‌గౌడ్, జ్యోతి, భరత్, రమ, తిరుపతి, వనిత, శ్రీలత, సునీత తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం'



పాదయాత్ర చేస్తున్న హరీశ్‌బాబు

కౌటాల(సిర్పూర్): బీజేపీతో గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నేత పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని పార్డీ, సాండ్‌గాం, వీరవెల్లి గ్రామాల్లో గురువారం పల్లెపల్లెకు పాల్వాయి– గడపగడపకు బీజేపీ పాదయాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ.11 కోట్లతో కౌటాల మండలానికి నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మించనున్నట్లు వెల్లడించారు. అన్ని గ్రామాలను పాల్వాయి పాలనలో అభివృద్ధి చేస్తామన్నారు. నాయకులు వానుపటేల్, సత్యనారాయణ, వెంకటేశ్, మల్లయ్య, గణపతి, విజయ్ ఉన్నారు.

పల్లెపల్లెనా.. ప్రగతి చాటేలా!

- నేటి నుంచి దశాబ్ది ఉత్సవాలు షురూ
- ఘనంగా ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- నేడు కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరణ



విద్యుత్ వెలుగుల్లో కలెక్టరేట్

సాక్షి, ఆసిఫాబాద్: నేటికి రాష్ట్రం ఆవిర్భవించి పదో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లావ్యాప్తంగా దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జూన్ 2 నుంచి 21 రోజుల పాటు వేడుకలు జరపనున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు తొమ్మిదేళ్లలో ప్రభుత్వం అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించనున్నారు. రైతు, విద్యుత్, పారిశ్రామిక, సాగునీరు, సంక్షేమం, పరిపాలన, సాహిత్యం, ఆధ్యాత్మికం, వైద్యారోగ్యం, పల్లెప్రగతి, పట్టణ ప్రగతి, తదితర రంగాల్లో సాధించిన ప్రగతిపై రోజువారీ కార్యక్రమాలు చేపట్టనున్నారు.

జూన్ 2న..
జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు ప్రారంభిస్తారు. జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ పతాకం ఆవిష్కరిస్తారు.

జూన్ 3న..
రైతు వేదికల్లో తెలంగాణ రైతు దినోత్సవం అట్టహాసంగా నిర్వహించనున్నారు. వేదికలను మామిడి తోరణాలు, పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించనున్నారు. పంచాయతీ కార్యాలయాల నుంచి ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో రైతువేదికల వరకు ర్యాలీగా వెళ్లనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వ్యవసాయంలో రాణిస్తున్న ముగ్గురు చొప్పున కర్షకులను సన్మానిస్తారు. వేడుకలకు హాజరైన రైతులకు భోజన సదుపాయం కల్పిస్తారు.

జూన్ 4న..
సురక్షా దినోత్సవం సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు చేస్తున్న కృషి, సాధించిన ఘనత, విజయాలను సభల ద్వారా, కరపత్రాల ద్వారా ప్రజలకు తెలియజేస్తారు. పెట్రోలింగ్ కార్లు, బ్లూకోల్ట్స్, ఫైర్ వెహికల్స్‌తో ర్యాలీ, సాయంత్రం ప్రజలు, ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బందితో సభ నిర్వహిస్తారు.

జూన్ 5న..
తెలంగాణ విద్యుత్ విజయోత్సవాల్లో భాగంగా విద్యుత్ రంగంలో సాధించిన గుణాత్మక మార్పులపై గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తారు. తెలంగాణ వచ్చిన తరువాత విద్యుత్ వ్యవస్థ బలోపేతం, సింగరేణి కార్మికులతో సమావేశాలు జరిపి బోనస్, కారుణ్య నియామకాలు, సంక్షేమ కార్యక్రమాలపై వివరించనున్నారు. అనంతరం కార్మికులతో సామూహిక భోజనాలు చేస్తారు.

జూన్ 6న..
తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవంలో భాగంగా పారిశ్రామిక వాడలు, ఐటీ కారిడార్లలో సభలు నిర్వహించి పారిశ్రామిక రంగంలో జరిగిన విప్లవాత్మక మార్పులు, సాధించిన ప్రగతి, టీఎస్ ఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపన, అనుమతుల మంజూరు అంశాలను వివరించనున్నారు. నాయకులు, ప్రజలు కలిసి చెరువు కట్ట మీద సహపంక్తి భోజనాలు చేస్తారు.

జూన్ 7న..
సాగునీటి దినోత్సవంలో భాగంగా సాగునీటి రంగంలో సాధించిన అద్భుతమైన ప్రగతిని వివరిస్తూ.. నియోజకవర్గంలో వెయ్యి మందితో సభలు నిర్వహించనున్నారు. బహుళార్థక సాధక ప్రాజెక్టులు, సాగునీటి సరఫరా అంశాలపై రైతులకు వివరిస్తారు.

జూన్ 8న..
ఊరూరా చెరువుల పండుగలో భాగంగా పంచాయతీలు, నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో పెద్ద చెరువు వద్దకు డప్పులు, బోనాలు, బతుకమ్మలు, మత్స్యకారుల వలలతో ఊరేగింపుగా వెళ్లి సాయంత్రం 5 గంటలకు చెరువుల పండుగ నిర్వహించనున్నారు. నాయకులు, ప్రజలు కలిసి చెరువు కట్ట మీద సహపంక్తి భోజనాలు చేస్తారు.

జూన్ 9న..
తెలంగాణ సంక్షేమ సంబురాలలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వం అందించిన ఆసరా పెన్షన్లు, కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో వెయ్యి మందికి తగ్గకుండా పాల్గొనేలా సభ నిర్వహించనున్నారు. ఈ సభలో నిధులు, ఫలితాల గురించి వివరిస్తూ.. నియోజకవర్గానికి ఇద్దరు చొప్పున గొల్లకుర్మలకు గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

జూన్ 10న..
తెలంగాణ సుపరిపాలన దినోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రాలలో సమావేశాలు ఏర్పాటు చేస్తారు.



ప్రభుత్వ వ్యవస్థలను ప్రజలకు మరింత చేరువ చేయడం ద్వారా కలిగిన మేలును ప్రస్తావించనున్నారు. వివిధ శాఖల పునఃవ్యవస్థీకరణ ద్వారా అందుతున్న సేవలను వివరించనున్నారు.

జూన్ 11న..
తెలంగాణ సాహిత్య దినోత్సవంలో భాగంగా తెలంగాణ కవులు, సాహిత్యాభిమానులు, ప్రజాప్రతినిధులతో కవి సమ్మేళనం ఏర్పాటు చేస్తారు. తెలంగాణ అస్తిత్వం, సాధించిన ప్రగతి ప్రతిబింబించేలా కవితా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కవితలతో కవితా సంకలనం ప్రచురించాలని నిర్ణయించారు.

జూన్ 12న..
తెలంగాణ రన్‌లో భాగంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో యువకులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో ఉదయం 6 గంటలకు పోలీసు శాఖ నేతృత్వంలో క్రీడలు, యువజన సర్వీసుల శాఖ భాగస్వామ్యంతో తెలంగాణ రన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

జూన్ 13న..
తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవంలో భాగంగా నియోజకవర్గ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, సెర్ప్ సిబ్బంది, మహిళా సర్పంచులు, చైర్‌పర్సన్లు, ఇతరులు వెయ్యి మందికి తగ్గకుండా మహిళా సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తమ మహిళా ఉద్యోగులకు సన్మానం చేయనున్నారు.

జూన్ 14న..
తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవంలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులు, వైద్యారోగ్య సిబ్బంది, నూతన మెడికల్, నర్సింగ్, పారామెడికల్ కళాశాలల విద్యార్థులను ఆహ్వానించి సభ నిర్వహించనున్నారు. ఉత్తమ సేవలు అందించిన ఆశవర్కర్, ఏఎన్‌ఎం, స్టాఫ్‌నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, వైద్యులను సన్మానిస్తారు.

జూన్ 15న..
తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవంలో భాగంగా ప్రతీ పంచాయతీ ఎదుట జాతీయ జెండా ఆవిష్కరిస్తారు. పల్లెప్రగతి ద్వారా వచ్చిన నిధులు, సంక్షేమ పథకాల ద్వారా జరిగిన లబ్ధి, గ్రామాల్లో కల్పించిన వసతుల వివరాలు, పారిశుధ్యం, పచ్చదనం, జాతీయ స్థాయిలో సాధించిన అవార్డుల గురించి తెలియజేస్తారు. ఉత్తమ జీపీల సర్పంచులు, ఉత్తమ మండలాల ఎంపీపీలను సన్మానించాలని నిర్ణయించారు.

జూన్ 16న...
తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవంలో భాగంగా కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఎదుట జాతీయ జెండా ఎగురవేయనున్నారు. అలాగే పట్టణ ప్రగతి, వివిధ సంక్షేమ పథకాల ద్వారా జరిగిన లబ్ధి, పట్టణంలో కల్పించిన వసతులు, మెరుగుపడిన తీరును వివరించనున్నారు. టీఎస్ బీపాస్, జీవో 58, 59ల ద్వారా ప్రజలకు కలిగిన లబ్ధిని వివరించి, ఉత్తమ వార్డు కౌన్సిలర్లు, ఉద్యోగులను సన్మానించనున్నారు.

జూన్ 17న..
తెలంగాణ గిరిజనోత్సవంలో భాగంగా గిరిజన సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి గిరిజన గ్రామాల్లో సభలు ఏర్పాటు చేస్తారు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తారు.

జూన్ 18న..
తెలంగాణ మంచినీళ్ల పండుగలో భాగంగా ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, జర్నలిస్టులు, వివిధ వర్గాల ప్రజలతో మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్స్, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ల సందర్శన కార్యక్రమం ఉంటుంది. నీటి శుభ్రత, ఇంటింటికి నల్లాల ద్వారా సరఫరా తీరును వివరిస్తారు.

జూన్ 19న...
తెలంగాణ హరితోత్సవంలో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో మొక్కలు నాటే కార్యక్రమం ఉంటుంది. అటవీశాఖ ఆధ్వర్యంలో పచ్చదనాన్ని పెంచడానికి జరిగిన కృషి, అడవుల పునఃరుద్ధరణకు చేపట్టిన చర్యలు, ఫలితాల గురించి తెలియజేస్తారు. ప్రతీ గ్రామంలో మాస్ ప్లాంటేషన్ నిర్వహించనున్నారు.

జూన్ 20న..
తెలంగాణ విద్యాదినోత్సవంలో భాగంగా మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా అన్ని పనులు పూర్తి చేసుకున్న పాఠశాలల్లో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పిల్లలకు వ్యాసరచన, చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహిస్తారు. మన ఊరు– మన బడి, గురుకులాల స్థాపన, విశ్వవిద్యాలయాలు, వైద్య, నర్సింగ్, పారామెడికల్, జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు తదితర అంశాలను వివరిస్తారు.

జూన్ 21న..
తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవంలో భాగంగా దేవాలయాలు, మసీదులు, చర్చీలు, ఇతర ప్రార్థనా మందిరాలను అలంకరించనున్నారు. వేద పారాయణం, ప్రత్యేక ప్రార్థనలు, ప్రముఖ క్షేత్రాల్లో భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథలు, పురాణ ప్రవచనాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

జూన్ 22న..
అమరుల సంస్మరణలో భాగంగా పంచాయతీ, మున్సిపాలిటీలలో ఉదయం 11 గంటలకు సమావేశమై అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తారు. అమరుల సంస్మరణ తీర్మానం చేయనున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ పరిధిలో ఉదయం అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తారు.

ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు పెంచాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- ‘బడిబాట’పై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 3 నుంచి 17 వరకు నిర్వహించే బడి బాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం విద్యాశాఖ, ఐసీడీఎస్, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మారుతున్న ప్రజల మనస్తత్వానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితులను మార్చాలని ఆదేశించారు. నాణ్యమైన విద్యను అందించినప్పుడే విద్యార్థులను ఆకర్షించగలమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు దాటిన పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఐదేళ్లు దాటిన వారు ఒక్కరూ కూడా బడిబయట ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులను బడిబాట కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. సమావేశంలో డీఈవో అశోక్, డీఐఈవో శ్రీధర్‌సుమన్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి సత్యనారాయణ, జిల్లా మైనార్టీ అభివృద్ధి అధికారి రబ్బాని తదితరులు పాల్గొన్నారు.



బోనమెత్తిన దహెగాం



దహెగాం మండల కేంద్రంలో పోచమాంబ శీతలాదేవి, నవగ్రహ సహిత సంతాన నాగేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. నాలుగోరోజు గురువారం అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామస్తులు బొడ్రాయి నుంచి పోచమాంబ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, భక్తుల పూజలతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. - దహెగాం

కాలం కలిసొచ్చేనా..?

- వానాకాలం సాగు ప్రణాళిక ఖరారు
- జిల్లాలో 4,55,038 ఎకరాల్లో పంటలు
- ఈసారి కూడా పత్తి వైపే రైతుల మొగ్గు
- గతేడాది అధిక వర్షాలు, వరదలతో తగ్గిన దిగుబడి

ఆసిఫాబాద్: జిల్లాలో వానాకాలం సాగు ప్రణాళికను వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సమకూర్చేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో 4,55,038 ఎకరాల్లో పత్తి, వరి, మొక్క జొన్న, కంది, పెసర, మొక్కజొన్నతో పాటు వివిధ పంటలు సాగు కానున్నట్లు అంచనా వేస్తున్నారు. అయితే రూ.కోట్లు వెచ్చించి జిల్లాలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ద్వారా పొలాలకు సాగునీరందక పోవడంతో ఏటా రైతులు ఆరుతడి పంటలే సాగు చేస్తున్నారు. తెల్ల బంగారానికి ధర ఎక్కువగా ఉండడంతో ఈ సారి జిల్లా రైతులు పత్తి వైపే మొగ్గు చూపే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. ఇప్పటికే కొంతమంది దుక్కులు దున్ని చేలు సాగుకు సన్నద్ధం చేస్తున్నారు.

పత్తి సాగు..
లాభసాటి పంట కావడంతో వానాకాలం సీజన్‌లో రైతులు పత్తి సాగుపైనే మొగ్గు చూపుతారని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. గతేడాది జిల్లాలో 4,15,000 ఎకరాల్లో పంటలు సాగు చేయగా, 3,12,000 ఎకరాల్లో పత్తి వేశారు. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో 4,55,038 ఎకరాల్లో పంటలు సాగు చేసే అవకాశం ఉండగా, అందులో 3,42,000 ఎకరాల్లో పత్తి పంటే వేస్తారని అధికారులు చెబుతున్నారు. గతేడాదితో పోలిస్తే పత్తి సాగు విస్తీర్ణం పెరగనుంది. అలాగే 58,780 ఎకరాల్లో వరి, 35,000 ఎకరాల్లో కంది, 9,657 ఎకరాల్లో సోయాబిన్, 3,017 ఎకరాల్లో పెసర, 2,962 ఎకరాల్లో జొన్న, 855 ఎకరాల్లో మొక్కజొన్న, 387 ఎకరాల్లో మినుము, 180 ఎకరాల్లో వేరుశనగతోపాటు 2,200 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది.



అందుబాటులో ఎరువులు, విత్తనాలు
జిల్లాలో వానాకాలం సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మరో ఈ నెల రెండో వారంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉంది. సాగుకు అనుకూలంగా కనీసం 60 మిల్లీమీటర్ల వర్షం కురిస్తేనే విత్తనాలు విత్తుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో రైతులు విత్తనాలు విత్తేందుకు దుక్కులు దున్ని చేలు సిద్ధం చేసుకున్నారు.

విత్తన ఎంపికే కీలకం
పత్తి సాగులో విత్తన ఎంపికే కీలకం కానుంది. ఒకే రకమైన పంట, విత్తనాలతో తెగుళ్ల ముప్పు పొంచి ఉంటుంది. నాలుగు కంపెనీలకు చెందిన నాలుగు రకాల విత్తనాలు ఎంపిక చేసుకోవాలి. లూజు విత్తనాలు వద్దు. పత్తిలో అంతర పంటగా కంది సాగు చేయాలి. దీంతో చీడపీడల బెడద తగ్గడంతోపాటు దిగుబడి పెరిగేందుకు ఆస్కారం ఉంటుంది. సుడిదోమ బెడద తగ్గుతుంది. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో విధిగా బిల్లులు తీసుకుంటే, మొలకరాని, దిగుబడి రాని సమయాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా ఉండొచ్చు.

జిల్లాకు కావాల్సిన విత్తనాలు

పంట	విస్తీర్ణం (ఎకరాల్లో)	విత్తనాలు (క్వింటాళ్లలో)
వరి	58,780	14,695
జొన్న	2,962	118.48
మొక్కజొన్న	855	68.40
కంది	35,000	1,400
పెసర	3,017	120.68
మినుము	387	15.48
వేరుశనగ	180	1.35
సోయాబిన్	9,657	2,897.1
పత్తి	3,42,000	6,84,000 (ప్యాకెట్లు)
ఇతర పంటలు	2,200	

ఎరువులు(మెట్రిక్ టన్నుల్లో)

యూరియా	45,060
డీఏపీ	11,265.39
ఎంవోపీ	4,053.01
కాంప్లెక్స్	22,538.03
ఎస్ఎస్‌పీ	3,000

నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

వానాకాలం సీజన్‌లో రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి. విత్తనాలు కొనుగోలు సమయంలో విధిగా బిల్లులు తీసుకోవాలి. లూజు విత్తనాలు వాడితే నష్టపోయే ప్రమాదం ఉంటుంది. డీఏపీ, ఎస్ఎస్‌పీ ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. లేదంటే విత్తనాలు మొలకెత్తవు. మంచి వర్షం పడిన తర్వాతనే విత్తనాలు విత్తుకోవాలి.

– రావూరి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

జీపీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి



వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(జేఏసీ) నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం జిల్లా కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెరిక శ్రీకాంత్ మాట్లాడుతూ పీఆర్సీ నిర్ణయించిన మినిమం బేసిక్‌ను వేతనంగా చెల్లించాలన్నారు. ఆలోగా జీవో 60 ప్రకారం సిబ్బందికి రూ.15,600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిబ్బంది వేతనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ శంకర్, నాయకులు నక్క మల్లేశ్, బొమ్మెన అశోక్, జగ్గారావు, నిరంజన్, నారాయణ, శంకర్, అజయ్, ప్రభాకర్, వినోద్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అగ్ని ప్రమాదంలో బోర్లు దగ్ధం

కౌటాల(సిర్పూర్): మండలంలోని వీరవెల్లి గ్రామ సమీపంలో వరికొయ్యలకు నిప్పు పెట్టడంతో పక్కనున్న పొలాలకు మంటలు వ్యాపించి కుబిడే హరిదాస్, ఎం.హరికృష్ణ, ఎకోస్కర్ గోపికి చెందిన బోర్లు దగ్ధమయ్యాయి. ఇద్దరు రైతుల వరిగడ్డి కుప్పలు సైతం కాలిపోయాయి. మంటలు వ్యాప్తి చెంది గ్రామ సమీపంలోకి రావడంతో స్థానికులు నీళ్లు చల్లి ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకు నష్టం జరిగినట్లు బాధిత రైతులు వాపోయారు.

గంజాయి కేసులో ఇద్దరు అరెస్టు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మ్యాదరివాడ సమీపంలో గంజాయి విక్రయించేందుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 3.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తహసినొద్దీన్ తెలిపారు. కుమురంభీం జిల్లా బెజ్జూర్ మండలానికి చెందిన దూపం దిలీప్, కొంక శ్రీనివాస్ మహారాష్ట్ర నుంచి తెచ్చిన గంజాయిని మంచిర్యాలలోని కొందరికి విక్రయించేందుకు వచ్చారు. తమకు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. తదుపరి విచారణ, కేసు నిమిత్తం స్థానిక సీఐ రాజుకు అప్పగించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

ఎన్‌హెచ్‌ఏఐ పీడీకి ఎన్‌హెచ్ బాధితుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జాతీయ రహదారి-63 విస్తరణతో విలువైన భూములు, ఇళ్లు కోల్పోకుండా న్యాయం చేయాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ అజయ్ మణికుమార్‌కు గురువారం ఎన్‌హెచ్ బాధితుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. హాజీపూర్, దొనబండ, ములకల్ల, వేంపల్లి గ్రామాలకు చెందిన పలువురు కొత్తగా అలైన్‌మెంట్‌తో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. లక్సెట్టిపేట నుంచి రాజీవ్ రహదారి వరకు గతంలో తయారు చేసిన గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రతిపాదన వల్ల నష్టం జరగదని, బ్రౌన్ ఫీల్డ్‌తో పూర్తి నిర్వాసితులుగా మారనున్నామని పేర్కొన్నారు. గోదావరి తీరం వెంట రహదారి విస్తరణ జరిగేలా చూడాలని కోరారు.

'కవ్వాల్'లో అడవి కుక్కల బెడద

- అభయారణ్యంలో ఏటా పెరుగుతున్న కుక్కల సంఖ్య
- పులినైనా ఎదిరించే సత్తా
- భయంతో అడవిలో కాలుపెట్టేందుకు బెబ్బులి వెనుకడుగు



జన్నారంలో ఇటీవల కెమెరాకు చిక్కిన అడవి కుక్కలు

జన్నారం(ఖానాపూర్): అడవి కుక్కలకు పులులు కూడా భయపడుతాయి. వన్యప్రాణులను హడలెత్తించే బెబ్బులి కూడా అడవి కుక్కలను చూసి వెనుదిరుగుతుంది. పులి వేటాడిన జంతువును అడవికుక్కలు లాక్కుపోతాయి. పులికి ఎదురు తిరిగే అడవి కుక్కల సంఖ్య పెరుగుతుండడంతో కవ్వాల్ అభయారణ్యంలో కాలుపెట్టడానికి పులి వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. వన్యప్రాణులను భయపెట్టే బెబ్బులి అడవి కుక్కలను చూసి భయపడుతుందా? అంటే అటవీశాఖ అధికారులు నిజమే అంటున్నారు. కొన్నిరోజులు రాకపోకలు కొనసాగించిన పులి ఏడాది కాలంగా కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో అడుగు పెట్టడం లేదు.

పులులకు అనువైన ప్రాంతం..

దట్టమైన అటవీ ప్రాంతం.. రకరకాల వన్యప్రాణులు.. పులి ఉండేందుకు అనువైన ఆవాసాలు.. జలపాతాలు.. కలబోసిన కవ్వాల్ అడవులు. ఈ అడవులు పులులకు అనువుగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం 2012 ఏప్రిల్ మాసంలో కవ్వాల్ అభయారణ్యాన్ని టైగర్‌జోన్‌గా ఏర్పాటు చేసింది. టైగర్‌జోన్ అడవులను 892.23 స్క్వేర్ కిలోమీటర్ల కోర్ ఏరియా, 123.12 స్క్వేర్ కిలోమీటర్ల బఫర్ ఏరియాగా గుర్తించారు. కవ్వాల్ టైగర్‌జోన్‌కు సమీపంలో మహారాష్ట్రలోని తాడోబా, తిప్పేశ్వర్, టైగర్ రిజర్వ్, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి టైగర్‌జోన్ ఉంటాయి. ఆయా టైగర్‌జోన్లలో పులుల సంఖ్య ఎక్కువ కావడంతో కవ్వాల్ టైగర్ జోన్‌లోకి ప్రవేశించే అవకాశాలున్నాయి. పులులకు అనువైన ప్రాంతంగా, ఇక్కడ పదికి పైగా పులులకు సరిపడా వన్యప్రాణులు, ఆవాసాలు ఉన్నందువల్ల ఇక్కడికి పులులు వస్తాయని అధికారులు అంచనా వేశారు.

టైగర్‌జోన్‌లో 240 వరకు అడవి కుక్కలు

పులికి ఎదురు తిరిగే అడవి కుక్కలు అడవిలో ఎక్కువగా ఉండడం కూడా పులి రాకపోవడానికి ఒక కారణమని చెప్పవచ్చు. కవ్వాల్ టైగర్ జోన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల రికార్డుల ప్రకారం సుమారుగా 240 వరకు అడవి కుక్కలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లో సుమారుగా 120 వరకు అడవి కుక్కలున్నట్లు తెలుస్తోంది. 10 నుంచి 12 వరకు గ్రూపుగా ఉంటూ దాడికి దిగుతాయని, ఇలాంటి గ్రూపులు జన్నారం డివిజన్‌లో 10 వరకు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పులి ఇక్కడ ఉండక పోవడానికి అడవి కుక్కల బెడద కూడా ఒక కారణంగా చెప్పుకోవచ్చంటున్నారు.

ఎదురు తిరిగే సత్తా

వన్యమృగాల్లో ఒకటైన అడవి కుక్కలకు ఏ జంతువుపైన అయినా ఎదురు తిరిగే సత్తా ఉందని అధికారులు పేర్కొంటున్నారు. జింకలు, నీలుగాయి, సాంబర్లు, చిరుత, పులి, ఎలుగుబంటి వంటి వన్యమృగాలపై కూడా అడవికుక్కలు గుంపులుగా దాడికి పాల్పడుతాయి. అందుకే అడవి కుక్కల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట పులులు, చిరుతలు ఉండవని అధికారులు చెబుతున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లో దట్టమైన అడవులు, లోయలు ఎన్నో ఉన్నాయి. వీటిలోనే చిరుతలు, పులులు ఆవాసం ఏర్పాటు చేసుకుంటాయి. అయితే ఆయా ప్రాంతాల్లో కూడా కుక్కలు తిరుగుతూ పులులు వేటాడిన మాంసాన్ని లాక్కునివెళ్లి తింటాయి. అడవి కుక్కల సంఖ్య మరింత పెరిగితే వన్యప్రాణులకు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది.

అడవి కుక్కల సంఖ్య పెరిగింది



కవ్వాల్ టైగర్‌జోన్‌లో జన్నారం డివిజన్ 12 శాతం మాత్రమే ఉంది. ఇక్కడ పులికి అనువైన ప్రదేశాలున్నాయి. జన్నారం అటవీ డివిజన్‌లో ఇటీవల అడవి కుక్కల సంఖ్య పెరిగింది. పులి రాకపోవడానికి అవి కూడా ఒక కారణం కావచ్చు. గతంతో పోలిస్తే డివిజన్‌లో అడవి కుక్కల సంఖ్య రెండు రెట్లు పెరిగినట్లు తెలుస్తోంది.

– సిరిపురం మాధవరావు, ఫారెస్ట్ డివిజనల్ అధికారి

ఆహారశుద్ధి పరిశ్రమలకు రుణాలు

- పీఎం ఎఫ్ఎంఈ పథకం కింద మంజూరు
- నిరుద్యోగులు, చిరు వ్యాపారులకు లబ్ధి

పీఎంఎఫ్ఎంఈ, తెలంగాణ ఫుడ్‌ప్రాసెసింగ్ సొసైటీ లోగో

పాతమంచిర్యాల: నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొందడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) పథకాన్ని ప్రవేశపెట్టింది. నిరుద్యోగులు, చిరువ్యాపారులు లబ్ధి పొందేలా తెలంగాణ రాష్ట్ర ఫుడ్‌ప్రాసెసింగ్ సొసైటీ, ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థలు సంయుక్తంగా జిల్లాలోని ఔత్సాహికులు ఆహారశుద్ధి కేంద్రాలు స్థాపించుకోవడానికి బ్యాంకుల ద్వారా 35 శాతం సబ్సిడీపై రుణాలు మంజూరు చేస్తోంది. బేకరీ ఉత్పత్తులు, ఫ్లోర్‌మిల్లులు, మినీ రైస్ మిల్లులు, బియ్యం, పాలు, పాల ఉత్పత్తులు, కూరగాయలు, చింతపండు, టోమాటో జ్యూస్‌లు, కెచప్‌లు, ఐస్‌క్రీం, కుల్ఫీ, పాపడ్, స్వీట్, మిల్లెట్ ఉత్పత్తులు, పౌల్ట్రీ, తేనె, బెల్లం తయారీ, సుగంధ ద్రవ్యాలు, చెరుకు, నూనె గింజల ఆధారిత ఉత్పత్తుల యూనిట్లకు రాయితీపై రుణాలు అందించనున్నారు. ప్రతి సంవత్సరం 200 యూనిట్లు స్థాపించడమే లక్ష్యంగా జిల్లా పరిశ్రమల శాఖ ఔత్సాహికులకు రుణసహాయం అందజేస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా వృత్తి నైపుణ్యాలు అవసరం లేదని, మామూలుగా ఎనిమిదో తరగతి వరకు చదువుకున్నవారు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా పరిశ్రమల కేంద్రం డీఆర్‌పీ రాఘవేందర్ తెలిపారు.

మహిళా సంఘాల సభ్యులు భాగస్వాములుగా..

ఈ ఏడాది ప్రత్యేకంగా మహిళా సంఘాల సభ్యులకు ప్రాధాన్యం కల్పించాలనే ఉద్దేశంతో రుణాల మంజూరు కోసం జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులు సైతం కొత్త యూనిట్లు ఏర్పాటు చేసుకోవడం లేదా పాతయూనిట్‌ల అభివృద్ధి కోసం రుణాలు మంజూరు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా జిల్లా పరిశ్రమల అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. ఆసక్తి కలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే వాటిని జిల్లా పరిశ్రమల అధికారులు, రిసోర్స్ పర్సన్‌లు పరిశీలన చేసి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఒక్కో యూనిట్ విలువ రూ.10 లక్షలుకాగా జిల్లా వ్యాప్తంగా 578 యూనిట్‌లు స్థాపించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం 470 దరఖాస్తులను స్వీకరించగా 102 యూనిట్లను మంజూరు చేశారు. 63 యూనిట్లు గ్రౌండింగ్ చేశారు.

ఆహారశుద్ధిరంగం బలోపేతం..

ఆహారశుద్ధి పరిశ్రమలు స్థాపించుకున్న వారికి సాంకేతిక సహాయంతో పాటు మార్కెటింగ్ అవకాశాలు కల్పించి ఆహార ఉత్పత్తులు పెంచడానికి మహిళా సంఘాల సభ్యులకు రాయితీ రుణాలు ఇస్తున్నాం. ఆహారశుద్ధి రంగాన్ని బలోపేతం చేయడానికి ఇప్పటికే ఆహార ఉత్పత్తులు చేస్తున్న మహిళా సంఘాల సభ్యులకు యూనిట్లు అభివృద్ధి చేసుకోవడానికి సబ్సిడీ రుణాలు ఇస్తున్నాం.

– బి.శేషాద్రి, డీఆర్‌డీవో, మంచిర్యాల

త్వరలోనే గోలేటి ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న జీఎం దేవేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న గోలేటి ఓసీపీలో అతి త్వరలో బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభం అవుతుందని ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. గురువారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కై రిగూడ ఓసీపీ మేలో 3.3 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యానికిగానూ 3.4 లక్షల టన్నులతో 101 శాతం ఉత్పత్తి సాధించామన్నారు. 3.97 లక్షల టన్నుల లక్ష్యానికి గానూ 7.38 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేశామన్నారు. ఏప్రిల్‌తో పోల్చితే మేలో 14 వేల టన్నులు అధికంగా సాధించామన్నారు. వట్టివాగు నాలా సెకండ్ డైవర్షన్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని బొగ్గు ఉత్పత్తికి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టామన్నారు. రూ.13 కోట్లతో గోలేటి సీహెచ్‌పీకి రెండో లూప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో డీజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో గోల్డ్‌మెడల్



గుర్రాల మన్యుత్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్-13, 15 సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పాల్గొన్న జిల్లా కేంద్రానికి చెందిన గుర్రాల మన్యుత్ ప్రతిభ కనబర్చి గోల్డ్‌మెడల్ సాధించాడు. త్వరలో బిహార్, ఒరిస్సాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని నిర్వాహకులు తెలిపారు.

13న గుర్తింపు ఎన్నికలపై సమావేశం

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించి ఈ నెల 13న నిర్వహించనున్న సమావేశానికి కార్మిక సంఘాల నాయకులు హాజరు కావాలని రిటర్నింగ్ అధికారి, డెప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ డీ.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరిపించడంలో జాప్యం చేస్తున్నారని కొన్ని సంఘాలు గతంలో హైకోర్టులో కేసు వేశాయి. దీనిపై హైకోర్టు ఈ ఏడాది మార్చి 23న ఇచ్చిన తీర్పు మేరకు సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని డెప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం జరుగనుందని, ఇందులో కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ఏబీఏపీ ఆధ్వర్యంలో గ్రూప్స్ స్టడీ సర్కిల్



స్టడీ మెటీరియల్ అందిస్తున్న తిరుమల్‌రావు

శ్రీరాంపూర్(మంచిర్యాల): అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ(ఏబీఏపీ) ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ కొత్త రోడ్డులోని శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గ్రూప్స్ స్టడీ సర్కిల్‌ను గురువారం ఏబీఏపీ రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమల్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్టడీ సర్కిల్ గ్రూప్స్ పరీక్షలు అయ్యే వరకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సందర్భంగా 50 మంది విద్యార్థులకు గ్రూప్స్ స్టడీ బుక్స్, స్టడీ చైర్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవాసమితి అధ్యక్షుడు వెల్మారెడ్డి శివారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి ఎల్పుల రవీందర్, గురుస్వాములు కొండ శ్రీనివాస్, బేతి అనంత సాయిరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బుక్య భీమ్, తదితరులు పాల్గొన్నారు.

'కుమ్మరి యువతకు బీసీబంధు ఇవ్వాలి'



మాట్లాడుతున్న కుమ్మరి సంఘం నాయకులు

జన్నారం(ఖానాపూర్): కుమ్మరి యువతకు బీసీబంధు కింద ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి చంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగుడు భూమన్న డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కుమ్మరి యువకులు ఉద్యోగాలు రాక, కుమ్మరి పని చేయలేక నిరుద్యోగులుగా మిగులుతున్నారన్నారు. ప్లాస్టిక్ వాడకంతో కుమ్మరి కుల వృత్తి భారంగా మారిందన్నారు. కుమ్మరి కుల వృత్తిని కాపాడటానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీ రామానంద తీర్థ శిక్షణ కేంద్రంలో యువకులకు శిక్షణ ఇప్పించి రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని, 50 సంవత్సరాలు నిండిన కుమ్మరులకు ఆసరా పింఛన్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో కోడూరి సత్తన్న, అంజన్న, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

9న రెండో విడత గొర్రెల పంపిణీ



మాట్లాడుతున్న కొమ్ము అశోక్

కోటపల్లి(చెన్నూర్): జిల్లాలో ఈ నెల 9న ముఖ్యమంత్రి కేసీఆర్ చేతులమీదుగా రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు గొర్రెలు మేకల వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ తెలిపారు. గురువారం బోరంపల్లిలో యాదవులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవ కుటుంబాలు అధికసంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉడుత రాజబాపును నియమించినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజాగౌడ్, నాయకులు శేఖర్, సంతోశ్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళపై గొడ్డలితో దాడి



గాయపడిన బుచ్చమ్మ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఇంటి హద్దు వివాదంలో మహిళపై గొడ్డలితో దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని గుడిపేటలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. హాజీపూర్ మండలం గుడిపేటలోని దుబ్బగూడెంకు చెందిన గోళ్ల శంకరయ్య, గోళ్ల లక్ష్మీనారాయణ అన్నదమ్ములు. కొంత కాలంగా ఇరువురి ఇంటి మధ్య హద్దు గోడ నిర్మాణం వివాదస్పదంగా మారింది. గురువారం ఇరువురి ఇంటి మధ్య హద్దుల మేరకు గోళ్ల శంకరయ్య హద్దుగోడ నిర్మాణం ప్రారంభించాడు. ఇష్టారాజ్యంగా కడుతున్నారంటూ లక్ష్మీనారాయణ వాగ్వాదానికి దిగాడు. శంకరయ్య భార్య బుచ్చమ్మ కూడా తన భర్తపైకి ఎందుకు గొడవకు దిగుతున్నావంటూ మందలించడంతో కోపోద్రిక్తుడైన లక్ష్మీనారాయణ ఒక్కసారిగా పక్కనే ఉన్న గొడ్డలితో బుచ్చమ్మపై దాడి చేశాడు. తీవ్రగాయాలు కావడంతో వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యంకోసం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బుచ్చమ్మ భర్త శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

'ఆశ్రమ' సీఆర్టీలకు తీపి కబురు

- 12 నెలల వేతనానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- ఉమ్మడి జిల్లాలో 1,126 మందికి ప్రయోజనం
- హర్షం వ్యక్తం చేస్తున్న సీఆర్టీలు

ఉమ్మడి జిల్లా సీఆర్టీల వివరాలు

జిల్లా	సీఆర్టీల సంఖ్య
నిర్మల్	143
ఆదిలాబాద్	450
మంచిర్యాల	103
కుమురంభీం	430



గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ఐటీడీఏ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లకు (సీఆర్‌టీ) రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఇప్పటికే ఇతర శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాల పెంపు వంటి ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకున్న ప్రభుత్వం, ఆశ్రమ పాఠశాలల సీఆర్‌టీలకు కూడా ఏడాది కాలంపాటు పూర్తి వేతనం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 1,126 మందికి ప్రయోజనం కలుగనుంది.

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులతో పాటు కాంట్రాక్టు రెసిడిన్షియల్ టీచర్లు (సీఆర్‌టీ) పని చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ అన్ని ప్రభుత్వ శాఖల పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను పెంచారు. సీఆర్‌టీల వేతనం కూడా పెంచి నెలకు ఎస్జీటీలకు రూ.21,255, స్కూల్ అసిస్టెంట్లకు రూ.28,977 అందజేస్తున్నారు. ఒక విద్యా సంవత్సరంలో ఏప్రిల్‌లోని చివరి పనిదినం వరకు అనగా పదిన్నర నెలలు మాత్రమే వీరికి వేతనం అందించే వారు. వేసవి సెలవుల్లో వేతనం ఇచ్చేవారు కాదు. వేసవి సెలవుల్లో కూడా తమకు వేతనం అందజేయాలని సీఆర్‌టీలు గత కొన్నేళ్ల నుంచి ప్రభుత్వానికి విన్నవిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో వీరి విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం 12 నెలల వేతనం అందజేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం 2022-23 విద్యా సంవత్సరం నుంచే అమల్లోకి వస్తుందని ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

జిల్లాలో 160మంది సీఆర్‌టీలకు ప్రయోజనం..

నిర్మల్ జిల్లాలో గిరిజన సంక్షేమశాఖ పరిధిలో 17ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో రెగ్యులర్ టీచర్లతో పాటు 143 మంది సీఆర్‌టీలు పని చేస్తున్నారు. వీరిలో 60మంది ఎస్జీటీలు, 83మంది స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గత విద్యా సంవత్సరం (2022-23) నుంచి వీరందరికీ 12 నెలల వేతనం అందనుంది. ప్రభుత్వ నిర్ణయంపై సీఆర్‌టీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాము ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నామని, రెగ్యులరైజ్ చేయాలని సీఆర్‌టీలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు



సీఆర్‌టీలకు పదిన్నర నెలల వేతనం కాకుండా ఏడాది కాలానికి పూర్తి వేతనం ఇవ్వాలని ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేశాం. మా విజ్ఞప్తులకు సానుకూలంగా ప్రభుత్వం స్పందించి సముచిత నిర్ణయం తీసుకున్నందుకు సంతోషంగా ఉంది. సీఆర్‌టీలు గత 20ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నాం. మా ఉద్యోగాలనూ రెగ్యులరైజ్ చేస్తే సీఎం కేసీఆర్‌కు, ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– మునినాయక్, జిల్లా ఆశ్రమ పాఠశాలల, సీఆర్టీల సంఘం అధ్యక్షుడు, నిర్మల్

12 నెలల వేతనం హర్షణీయం



రెండు దశాబ్దాలుగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు. అప్పట్లో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ పేరుతో విధుల్లో చేరిన వీరంతా 20ఏళ్లుగా బోధన చేస్తున్నారు. రాష్ట్రం వచ్చిన తరువాత ఎన్నోసార్లు పలు పద్ధతుల్లో ప్రభుత్వానికి విన్నవించుకుంటూ వస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం 12నెలల వేతనాలు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయం.

– తోట నరేంద్రబాబు, పీఆర్టీయూ అధ్యక్షుడు







